క్లుప్తంగా

కూలీలకు ఎమ్మెల్యే పరామర్శ



కూలీలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సత్యం

రామడుగు: మండలంలోని వెదిర గ్రామంలో బుధవారం దాడిలో గాయపడి కరీంనగర్ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఉపాధి కూలీలను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గురువారం పరామర్శించారు. ఎలాంటి ఇబ్బంది రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులను కోరారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణం కూల్చివేత

తిమ్మాపూర్: మండలం కొత్తపల్లి గ్రామ శివారులో కొన్నేళ్ల క్రితం నిర్మించిన షెడ్డు తో పాటు వే బ్రిడ్జిని ఎస్సారెస్పీ అధికారులు బుధవారం కూల్చివేశారు. ఈ నిర్మాణం ఎస్ఆర్ఎస్పీ స్థలంలో ఉందని ఓ నాయకుడి హస్తం ఉందని కొంతమంది అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిర్మాణాన్ని పరిశీలించిన అధికారులు జేసీబీ సహాయంతో తొలగించినట్లు ఎస్సారెస్పీ ఎస్ఈ శివకుమార్ తెలిపారు. అనుమతి లేకుండా ఎస్సారెస్పీ స్థలంలో ఎలాంటి కట్టడాలు చేపట్టొదని అధికారులు సూచించారు.

ఇద్దరిపై కేసు

వీణవంక: అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ పోలీసులతో గొడవకు దిగిన ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తిరుపతి తెలిపారు. మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి వీర్ల రఘు, ఆషాడపు వినయ్ రెండు ట్రాక్టర్లలో ఇసుక అక్రమంగా తరలిస్తుండగా పోలీసుల పట్టుకున్నారు. పోలీసులతో గొడవకు దిగి ట్రాక్టర్లతో తప్పించుకొని పోగా కేసు నమోదు చేశామని వినయ్‌ను రిమాండ్‌కు తరలించగా రఘు పరారీలో ఉన్నాడని ఎస్ఐ వివరించారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

హుజూరాబాద్‌రూరల్: మద్యం సేవించి వాహనాలు నడిపితే శాఖాపరమైన చర్యలు తప్పవని హుజూరాబాద్ ఎంవీఐ కంచి వేణు అన్నారు. గురువారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వాహనం కండిషన్‌ను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలన్నారు. వాహనానికి సంబంధించి ధ్రువీకరణపత్రాలు వెంట ఉంచుకోవాలని, వాహనాలు నడిపేటప్పుడు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

బీమా చెక్కు అందజేత

సైదాపూర్: మండలంలోని రాయికల్ పురుషుల పొదుపు సంఘం సభ్యుడు పైడాకుల శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆయన భార్య రజితకు రూ.67,101 చెక్కును పొదుపు సమితి అధ్యక్షుడు పైడిపల్లి రవీందర్ గురువారం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మాధవరెడ్డి, ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, సభ్యులు లక్ష్మణ్, రాజిరెడ్డి, తిరుపతి, వెంకటరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కుమారస్వామి, రాజిరెడ్డి, రవీందర్, లింగారెడ్డి, గణకుడు వీరన్న ఉన్నారు.

విజయవంతం చేయాలి

సైదాపూర్: హైదరాబాద్‌లోని మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడలో ఈ నెల 6న నిర్వహించే కాంగ్రెస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్లమెంట్ ఎన్నికల హుస్నాబాద్ నియోజకవర్గ కోఆర్డినేటర్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచార ప్రారంభ సభకు సోనియాగాంధీ వస్తున్నారని, మండలం నుంచి అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కు మాటలు తప్పా, ప్రజల సమస్యలు పట్టించుకోవడంలేదని, ఐదేండ్లు ఎంపీగా ఉండి పైసా పని చేయలేదన్నారు. బండి సంజయ్ ప్రజా సేవకు పనికి రాడని, మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు మానుకోకపోతే తగిన బుద్ధి చెబుతామన్నారు. వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

సైదాపూర్: అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో మండలంలోని ఘనపూర్ గ్రామానికి చెందిన తూటి లక్ష్మీపతి(42) ఉరేసుకొని మృతిచెందాడని సైదాపూర్ ఎస్ఐ ఆరోగ్యం గురువారం తెలిపారు. లక్ష్మీపతి కొంత కాలంగా అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా మనోవేదనకు గురయ్యాడు. బుధవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. గొడిశాల శివారులో బెల్లం గట్టయ్య వ్యవసాయ భూమి వద్ద చెట్టుకు ఉరేసుకొని మృతి చెందాడని భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఎల్‌వోసీ అందజేత

హుజూరాబాద్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లికి చెందిన దాసరి సురేందర్‌కు గురువారం వొడితెల ప్రణవ్ రూ.80 వేల ఎల్‌వోసీ అందజేశారు. సురేందర్ కుమారుడు శరత్‌చంద్ర వైద్య చికిత్స కోసం మండలంలోని సింగాపూర్ గ్రామంలో ఎల్‌వోసీ ఇచ్చారు.

లక్ష్యం దిశగా ముందుకు..

- కుటుంబానికి వందరోజుల పనికల్పించేలా ఈజీఎస్ అధికారుల ప్రణాళిక
- గతేదాది గునుకులకొండాపూర్‌లో అత్యధికం, యాస్వాడలో అత్యల్పం
- మండలంలో 10,196 మంది కూలీలు



చొక్కారావుపల్లెలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

గన్నేరువరం: వలసలను ఆపేందుకు ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ప్రతి కూలీకి పని కల్పిస్తోంది. ఇప్పుడు అధిక కుటుంబాలకు 100 రోజుల పని కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి టార్గెట్ ముగిసింది. మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో 1,67,751 పని దినాలను కూలీలకు కల్పించి, 426 కుటుంబాలకు వంద రోజుల పని కల్పించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనులు ప్రారంభించారు. గ్రామాల వారీగా పనిదినాలను సైతం ఖరారు చేశారు. మండలంలో మొత్తం 10,196 మంది కూలీలు ఉండగా 1,33,874 పని దినాలు లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఈ ఏడాది లక్ష్యం చేరేనా?

2023–24 సంబంధించి 1,94,572 పని దినాలు లక్ష్యం కాగా 1,67,751 పని దినాలతో 86.22 శాతం లక్ష్యం పూర్తి చేశారు. చాలివానిపల్లెలో 10, చీమలకుంటపల్లెలో 14, చొక్కారావుపల్లెలో 8, గన్నేరువరంలో 52, గోపాల్‌పూర్‌లో 3, గుండ్లపల్లిలో 11, గునుకులకొండాపూర్ 72, హన్మాజిపల్లెలో 61, జంగపల్లిలో 44, ఖాసీంపేటలో 31, మాదాపూర్‌లో 13, మైలారంలో 62, పారువెల్లలో 35, పీచుపల్లిలో 2, సాంబయ్యపల్లెలో 3, యాస్వాడలో 5 కుటుంబాలకు 100 రోజుల పని కల్పించారు. హన్మాజిపల్లెలో అత్యధికంగా 13,199, పీచుపల్లిలో అత్యల్పంగా 1,260 పని దినాలను కూలీలకు కల్పించారు. 2024–25 సంబంధించి ఉపాధి పనులు ఏప్రిల్ 1న ప్రారంభమయ్యాయి. మూడు, నాలుగు రోజుల్లోనే 1600 మించి కూలీలు పనులకు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు పని చేయడానికి అవకాశం ఉన్నా 11 గంటలోపే ఇంటికి చేరుకుంటున్నారు. కానీ ఐదు గంటలు పనిచేస్తేనే కూలీకి సరైన వేతనం రూ.300 లభించే అవకాశం ఉంటుంది.



హన్మాజిపల్లెలో కందకం తవ్వకంలో కూలీలు

స్థానికంగా పని దొరుకుతుంది



జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో ప్రతి కూలీకి స్థానికంగానే పని దొరుకుతుంది. పనికోసం డిమాండ్ చేస్తే వెంటనే పని కల్పిస్తున్నారు. దీంతో గత ఏడాదిలో మా కుటుంబ సభ్యులం 100 రోజుల పని దినాలను పూర్తి చేసుకున్నాం. ఈ ఏడాది మాత్రం ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో కొంత ఇబ్బంది పడుతున్నాం.

– మంకాలి సవిత, కూలీ, హన్మాజిపల్లె

లక్ష్యానికి అనుగుణంగా పని కల్పిస్తున్నాం



లక్ష్యానికి అనుగుణంగా కూలీలకు పనులు కల్పిస్తున్నాం. దీంతో 2023–24 ఆర్థిక సంవత్సరంలో 1,94,572 పని దినాలు లక్ష్యం కాగా 1,67,751 పని దినాలు కూలీలకు కల్పించి 86.22 శాతం పనులు పూర్తి చేశాం. 426 కుటుంబాలకు వంద రోజులు పనులు కల్పించాం. ఈ ఏడాది లక్ష్యం నెరవేరేందుకు పనులు ముమ్మరం చేస్తున్నాం.

– శంకర్, ఎంపీడీవో, గన్నేరువరం

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దేవయ్య, నాయకులు

హుజూరాబాద్‌రూరల్: రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యతని జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ యాత్ర గురువారం రాత్రి హన్మకొండ నుంచి హుజూరాబాద్ పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... రాజ్యాంగాన్ని కొంతమంది మార్పు చేయడానికి ప్రయత్నిస్తున్నారని అలా చేస్తే జీవించే, స్వేచ్ఛగా మాట్లాడే హక్కులు కోల్పోతామని అన్నారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు న్యాయం చేయడానికి ప్రయత్నం చేస్తుందని, అంబేద్కర్ స్ఫూర్తితో ప్రశ్నించే గొంతుకలను బీజేపీ ప్రభుత్వం అణిచివేస్తూ కుట్రలు చేస్తుందని, రాజ్యాంగ రక్షణ కోసం మాలమహానాడు ప్రజల్లో చైతన్యం కలిగించడానికి రాజ్యాంగ రక్షణ యాత్ర చేపట్టిందన్నారు. కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య, పురుషోత్తం వెంకట్‌స్వామి, రాజు దేవయ్య, సమ్మయ్య, నాగరాజు, ఉదయ్, సొల్లు బాబు, మాజీ సర్పంచ్ తోగరు భిక్షపతి, పుష్పలత, సునీత, ఎడ్ల విజయ్, జూపాక శ్రీనివాస్, కోడం నర్సింగరావు, నీరటి శ్రీనివాస్, హేమలత పాల్గొన్నారు.

గన్నేరువరం: భారత రాజ్యాంగ రక్షణ యాత్ర కరపత్రాన్ని మండలకేంద్రంలో రాష్ట్ర సాంస్కృతికశాఖ సారథి చైర్మన్ ఎలుక దేవయ్య గురువారం ఆవిష్కరించారు. రాజ్యాంగం మారిస్తే భావితరాలకు తీరని అన్యాయం జరిగే ప్రమాదం ఉందని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే వార్డు సభ్యుడు, సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎమ్మెల్యే, ఎంపీ పదవులు వస్తున్నాయని అన్నారు. అందుకే ఓటు ద్వారా బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలన్నారు. కరీంనగర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్దకు శుక్రవారం యాత్రకు చేరుకుంటుందని, భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అనుమండ్ల మల్లేశం, ఉపాధ్యక్షుడు కర్ర కొమురయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు న్యాత శ్రీనివాస్, సభ్యులు న్యాత రాజేందర్, మీసాల ప్రభాకర్, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల పని కల్పించేలా ప్రణాళిక తయారుచేసుకోవాలి



కూలీలతో మాట్లాడుతున్న శ్రీధర్, అధికారులు

జమ్మికుంట: మండలంలోని విలాసాగర్, బిజిగిరిషరీఫ్ గ్రామాల్లో గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీధర్ గురువారం ఉపాధి హామీ పనులను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం కూలీలకు రోజు రూ.300 వేతనం చెల్లిస్తుందని, కొలతలు వేసి పనులు చేయాలన్నారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా వైద్య సౌకర్యం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిజేయాలని అధికారులకు సూచించారు. ప్రతి కూలీకి వంద రోజుల పని కల్పించేలా ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో, ఏపీడీ కృష్ణ, ఏపీవో తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎంపీటీసీ తిరుపతిరెడ్డి

తిమ్మాపూర్: మండలంలోని నుస్తులాపూర్‌లో ఎంపీటీసీ కొత్త తిరుపతిరెడ్డి మంజూరు చేయించిన రూ.5 లక్షలతో ఓపెన్ జిమ్ నిర్మిస్తున్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేస్తున్న ఓపెన్ జిమ్ పనులను ఎంపీటీసీ తిరుపతిరెడ్డి గురువారం పరిశీలించారు. త్వరలో పనులు పూర్తి చేసి వెంటనే ప్రారంభిస్తామని తెలిపారు. వెంట కాంగ్రెస్ నాయకులు సిరిగినేని కొండాల్‌రావు, వంగాల రవీందర్‌రెడ్డి, పల్లపు ఆంజనేయులు, ఆవుల రాజు, కొత్త రాజశేఖర్‌రెడ్డి, సిరిగినేని లక్ష్మణ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రాంగణ నియామకాలు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామం వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రాంగణ నియామకాలు నిర్వహించామని కళాశాల ప్రిన్సిపాల్ హనుమాకుమర్ తెలిపారు. సోనీ ఎంటర్‌ప్రైజెస్ కంపెనీ హైదరాబాద్ బ్రాంచ్‌కి 40 మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాంగణ నియామకాల అధికారి తాళ్లపల్లి అజయ్, కంపెనీ చెందిన రణధీర్, రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



గన్నేరువరం: మైలారంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీసీ యాదయ్య



చొప్పదండి: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐకేపీ ఏపీఎం నర్మద

గన్నేరువరం: మండలంలోని గుండ్లపల్లి, జంగపల్లి, మైలారం, ఖాసీంపేట గ్రామాల్లో డీఆర్‌డీఏ, ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఐకేపీ సీసీ యాదయ్య నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు. దళారులను ఆశ్రయించకుండా మద్దతు ధర కల్పించడానికి ప్రభుత్వం గ్రామాల్లో కేంద్రాలను ఏర్పాటు చేసిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మహిళా సంఘాల సభ్యులు, హమాలీలు పాల్గొన్నారు.

చొప్పదండి: మండలంలోని పదకొండు గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించారు. ఇప్పటికే ఐకేపీ అధికారులు ఒక కేంద్రం ప్రారంభించగా, కొనుగోలు కేంద్రాల సంఖ్య ఐకేపీ ఆధ్వర్యంలో పన్నెండుకు చేరింది. రైతులు ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాలలో ధాన్యం అమ్ముకోవాలని ఏపీఎం నర్మద కోరారు. ఆమె వెంట ఐకేపీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కల్యాణ ఘట్టం



చిడుతల రామాయణంలో సీతాదేవిని కన్యాదానం చేస్తున్న సన్నివేశం

జమ్మికుంట: మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామంలో కరీంనగర్ జిల్లా సాంస్కృతిక సంస్థల సమైఖ్య ఆధ్వర్యంలో చిడుతల రామాయణ ప్రదర్శనను మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ వంశీధర్‌రావు, రామాయణ కళా గురువులు సమైఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు బోళ్ల కొమురయ్య , శంకరపట్నం మండల కళాకారుల సంఘం అధ్యక్షుడు పడాల సత్యనారాయణ ప్రారంభించారు. శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవ ఘట్టం పలువురిని ఆకట్టుకుంది. మానవ సంబంధాలు, ప్రవర్తన,సమాజంలో ఎలా జీవించాలి అనేది రామాయణం తెలుపుతుందన్నారు. 30 మంది కళాకారులు ఐదురోజుల పాటు రామాయణం ప్రదర్శించగా అభినందించారు.

పుస్తెమెట్టెలు అందజేత



పుస్తె మెట్టెలు అందిస్తున్న డైయిరీ నిర్వాహకులు

చొప్పదండి: మండలంలోని దేశాయిపేటకు చెందిన పాల ఉత్పత్తిదారుడు ముదుగంటి మల్లయ్య తన కూతురు కవిత వివాహం సందర్భంగా కరీంనగర్ డైరీ ఆధ్వర్యంలో పుస్తె మట్టెలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ మేరకు పాల సేకరణ కేంద్రం అధ్యక్షుడు పెరుమాండ్ల రవిందర్, సూపర్‌వైజర్ గోపాల్, కార్యదర్శి వెంకటేశ్‌లు పుస్తె మట్టెలను అందించారు. ఈ కార్యక్రమంలో గుంట రవి, సింగిరెడ్డి వెంకట్ రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని అంబాల్‌పూర్‌లో పాడిరైతు గుడిసె రాజయ్య,లక్ష్మి దంపతుల కూతురు పుష్పలత వివాహం గురువారం జరిగింది. కరీంనగర్ డెయిరీ గ్రామ అధ్యక్షుడు రవి పుస్తె మెట్టెలు అందజేశారు. కార్యక్రమంలో ప్రకాశ్, సదానందం పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం





సాక్షి స్పందన

సైదాపూర్: గత బీఆర్ఎస్ ప్రభుత్వం సోమారం ఎల్లమ్మ గుడి, గర్రెపల్లి నుంచి సైదాపూర్ తారు రోడ్డు వరకు రూ.2.80 కోట్లతో రోడ్డు, వాగులో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఎన్నికలకు ముందు అప్పటి ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ శంకుస్థాపన చేసినా పనులు చేపట్టలేదు. గర్రెపల్లి ప్రజలు, విద్యార్థులు సైదాపూర్‌కు వెళ్లాలంటే సోమారం నుంచి అదనంగా ఏడుకిలోమీటర్ల దూరం ప్రయాణించారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ మాత్రం పనులు చేపట్టలేదు. కాగా బ్రిడ్జి నిర్మాణ పనులు తాను చేయిస్తానని అప్పటి అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి సబ్‌-కాంట్రాక్ట్ ఒప్పందం కుదుర్చుకున్నాడు, ఇంతలో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. నాణ్యతతో పనులు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో సబ్‌కాంట్రాక్టర్ ఎగిరిపోయాడు. కాంట్రాక్టర్ పనులు చేపట్టడంలేదు. వర్షాకాలానికి మూడు నెలల సమయం ఉంది. బ్రిడ్జి నిర్మించకుంటే రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉందని సమస్యను వివరిస్తూ 'ఇప్పుడు నిర్మించకుంటే అప్పటికీ తిప్పలే!'అనే కథనం బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైంది. కథనానికి జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గురువారం రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు



హన్మాజిపల్లెలో మాట్లాడుతున్న ఎస్సై నరేశ్



కందుగులలో పోలీసులు, జవాన్ల కవాతు

హుజూరాబాద్‌రూరల్: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ అన్నారు. మండలంలోని కందుగుల, కనుకులగిద్దె గ్రామాల్లో కరీంనగర్ సీపీ ఆదేశాల మేరకు కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు అధికారులకు సహకరించాలన్నారు. సోషల్ మీడియాల్లో అభ్యంతకర సందేశాలు పంపితే శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు. మిటింగ్‌లకు ముందస్తు అనుమతి తీసుకోవాలని, ఎన్నికల నియామవళిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ రమేశ్, కేంద్రబలగాలు, అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

గన్నేరువరం: హన్మాజిపల్లెలో గురువారం ఎస్సై తాండ్ర నరేశ్ కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. హన్మాజిపల్లి స్టేజీ నుంచి ప్రభుత్వ పాఠశాల గ్రామ వీధుల గుండా అంబేద్కర్ చౌరస్తా వరకు కవాతు నిర్వహించిన అనంతరం ఎస్సై మాట్లాడారు. ఎలాంటి వివాదాలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి ఆదేశాల మేరకు సమస్యాత్మక గ్రామాలను గుర్తించి కవాతు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్సై ప్రసాద్, పీఆర్ ఏఈ, గ్రామ పంచాయతీ ప్రత్యేధికారి స్నేహజ్యోతి, స్థానికులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న టాస్క్ ట్రైనర్ రమేశ్

హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ డెవలప్‌మెంట్ టాస్క్ శిక్షకుడు కె.రమేశ్ అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం సాంకేతిక పరిజ్ఞానం, విద్యార్థి నైపుణ్యంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. కంప్యూటర్ సైన్స్ చదివిన విద్యార్థులు ఉద్యోగం లేదా స్వయం ఉపాధి కోసం కోడింగ్, టెస్టింగ్, అప్రోచ్, నెట్‌వర్కింగ్ తదితర విషయాల్లో పరిజ్ఞానం పెంచుకోవాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కంప్యూటర్ రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని, మార్పులకు అనుగుణంగా స్కిల్స్‌ను పెంపొందించుకోవాలన్నారు. అనంతరం కళాశాల డైరెక్టర్ శంకర్ మాట్లాడుతూ... కళాశాలలోని సదుపాయాలను విద్యార్థులు సద్వి నియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రి న్సిపాల్ ఈశ్వరయ్య, సమన్వయకర్త, అధ్యాపకుడు పవన్కుమార్, సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించాలి



ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

జమ్మికుంట: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు క్వింటాల్‌కు రూ.500 బోనస్‌తో ధాన్యం కొనుగోలు చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేశ్ డిమాండ్ చేశారు. గురువారం జమ్మికుంట వ్యవసాయ పాత మార్కెట్‌లోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. కోతలు లేకుండా కొనుగోలు చేయాలని, ఇందిరమ్మ భరోసా కింద రైతులకు రూ. 15వేలు, కౌలు రైతులకు రూ.12వేలు, రెండు లక్షల రుణమాఫీ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులకు రూ.25 వేల పరిహారం, ప్రస్తుతం ఎండిపోతున్న పంటలకు సాగునీరు అందించాలని, ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయలన్నారు. అనంతరం వార్డులో మైక్రో డొనేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవి, సుధాకర్‌రెడ్డి, అశోక్, స్వామి, స్వరూప, రవిచంద్రరెడ్డి, రామ్, రాచపల్లి ప్రశాంత్, ఇల్లందుల శ్రీనివాస్, వేముల జగన్, మైస భాగ్య, కనమల్ల లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆటాపాటలు



గన్నేరువరం: మండలంలోని జంగపల్లి గ్రామంలో గురువారం అంగన్‌వాడీ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల ఆటాపాటలు ఆకట్టుకున్నాయి. అంగన్‌వాడీ కేంద్రంలో రోజువారీ కార్యక్రమాలను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అటికం రజిత, ఆయా, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రామడుగులో బీజేపీ నాయకుల రైతు దీక్ష



రైతు దీక్షలో బీజేపీ నాయకులు

రామడుగు: రైతులకు రూ.రెండులక్షల రుణమాఫీని కాంగ్రెస్ పార్టీ తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలో గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు ఒంటెల కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతు దీక్ష నిర్వహించారు. ఎండిన వరికి ఎకరాకు రూ.25 వేలు అందించాలని నినాదాలు చేశారు. పసలు బీమా అమలుతో పాటు రూ.ఐదువందల బోనస్ అందించాలన్నారు. కార్యక్రమంలోఎంపీటీసీ మోడీ రవీందర్, నాయకులు జిన్నారం విద్యాసాగర్, పొన్నం శ్రీనివాస్, పూరెల్ల శ్రీకాంత్, కళ్లెం శివ, బండారి శ్రీనివాస్, బక్కశెట్టి శ్రీకాంత్, మల్లేశం, శంకర్ పాల్గొన్నారు.